క్లుప్తంగా

ఈ-కేవైసీ తప్పనిసరి

బిక్కవోలు: మండలంలోని వివిధ గ్రామాల రేషన్‌కార్డు లబ్ధిదారులు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తహసీల్దార్ బీఎస్ వీవీ కృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన రేషన్ డీలర్లతో మాట్లాడుతూ, మండలంలో 60,450 మంది రేషన్‌కార్డు లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు. వీరిలో ఇప్పటివరకు 55,154 మందికి ఈ-కేవైసీ పూర్తయిందన్నారు. మిగిలిన 5,296 మంది నమోదు చేయించాల్సి ఉందన్నారు. వచ్చే నెలలో నూతన రేషన్ కార్డులు వస్తాయని, అందువలన ముందుగా ఈ-కేవైసీ ఉన్నవారికే వచ్చే అవకాశం ఉందన్నారు. ఇతర రాష్ట్రంలో ఉన్నవారు ఈ-కేవైసీ చేయించుకోకపోతే రేషన్ కార్డు తొలగించే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పసరిగా ఈ-కేవైసీ పూర్తయిందా లేదా అని సంబధింత రేషన్ డీలర్‌ను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ



విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సభ్యులు

పెదపూడి: సత్యసాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో గ్రామంలో గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శుక్రవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి జిల్లా అధ్యక్షుడు గోవింద రాజులు మాట్లాడుతూ, సమితి ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల పరీక్షలు పూర్తయ్యే వరకు మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు.

విజయదుర్గ అమ్మవారికి పంచామృతాభిషేకం



విజయదుర్గ అమ్మవారు

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన విజయ దుర్గ అమ్మవారికి శుక్రవారం ఘనంగా పంచామృతాభిషేక పూజలు జరిగాయి. అమ్మవారికి కుంకుమ పూజలు చేసి, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రధానార్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు భక్తులతో లలితా, విష్ణు సహస్ర పారాయణం చేయించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పోలవరం ప్రాజెక్ట్ ఎడమ కాలువ పరిశీలన

సీతానగరం: మండలంలోని చీపురుపల్లి పంచాయతీ పరిధిలో అచ్చయ్యపాలెం వద్ద పోలవరం ప్రాజెక్ట్ ఎడమ కాలువను తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. పోలవరం ప్రాజెక్ట్ ఎడమ కాలువ తవ్వకాలకు కొండరాళ్లు అడ్డురావడంతో ఉన్నతాధికారులు సూచనల మేరకు తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎడమ కాలువ తవ్వకాలకు కొండ రాళ్లు అడ్డు వస్తున్నాయని, వాటిని బ్లాస్ట్ చేయడానికి అనుమతులు కోసం పరిశీలించామన్నారు. అచ్చయ్యపాలేనికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉందని, బ్లాస్ట్ చేయడానికి ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. ఆయన వెంట ఆర్ఐ రవీంద్ర, సర్వేయర్ గౌతమ్, వీఆర్వో వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వెలగాలమ్మకు విశేష పూజలు

మధురపూడి: కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామ దేవత వెలగాలమ్మ జాతర మూడో రోజు శుక్రవారం జరిగింది. ఉదయం నుంచి భక్తుల రద్దీ ఏర్పడింది. అర్చకులు అమ్మవారికి కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం వరకు జాతర కొనసాగుతుంది. భక్తుల రాకతో గాడాల నుంచి నిడిగట్ల రోడ్డులో రద్దీ ఏర్పడింది.

నేడు రీ సర్వే గ్రామసభ

సీతానగరం: మండలంలోని మిర్తిపాడులో శనివారం రీ సర్వే గ్రామసభ నిర్వహిస్తామని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనవరి 20 నుంచి భూముల రీ సర్వే ప్రక్రియను రైతుల సమక్షంలో నిర్వహించామన్నారు. రీ సర్వే అనంతరం భూముల కొలతలను నిర్ధారించామని, ఆ వివరాలను భూ యజమానులకు నోటీసుల ద్వారా తెలియజేయడానికి శనివారం ఉదయం 10 గంటలకు సచివాలయం వద్ద గ్రామ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

గుంటూరులో వ్యవసాయ ప్రదర్శన

రాజానగరం: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 29 వరకు లాంఫామ్, గుంటూరులో దక్షిణ భారత ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన జరగనుందని దివాన్‌చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ చల్లా వెంకటనరసింహమూర్తి తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులను ఏరువాక కేంద్రం ద్వారా ఈ ప్రదర్శనకు ఉచితంగా తీసుకువెళ్లి, తీసుకువస్తామన్నారు.

ప్రయాణం.. కావాలి సురక్షితం

- అతివేగం అనర్థదాయకం..
- నియంత్రణ నినాదానికే పరిమితం
- రోడ్లు విశాలమైనా తగ్గని ప్రమాదాలు
- అతివేగంతో వెనుక నుంచి ఢీకొడుతున్న వైనం
- నిర్లక్ష్యం కారణంగా తప్పని మరణాలు



ఆదికవి నన్నయ యూనివర్సిటీ సమీపంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన యువకుడు (ఫైల్)



దివాన్‌చెరువు పండ్ల మార్కెట్ వద్ద తోటికోడళ్ల దుర్మరణం (ఫైల్)

- అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువుకు సీరియస్‌గా ఉందని తెలిసి, చూసేందుకు వెళ్లి తిరిగొస్తుండగా జాతీయ రహదారిపై గైట్ కళాశాల వద్ద ప్రమాదానికి గురై ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు.
- సీతానగరం మండలంలోని బొబ్బిలిలంక వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడి మృతి.
- రెక్కాడితే కానీ డొక్కాడని ఇద్దరు మహిళలు(తోడికోడళ్లు) దివాన్‌చెరువు పండ్ల మార్కెట్ వద్ద లారీ వెనుక నుంచి ఢీకొనడంతో అక్కడికక్కడే ఇద్దరూ మృతి చెందారు.
- గామన్ బ్రిడ్జిపై పక్కన వాహనాన్ని ఆపి, టైర్లలో గాలిని చెక్ చేస్తున్న లారీ డ్రైవర్‌ను వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతి. ఇలా గడచిన మూడు మాసాల్లో 12 ప్రమాదాలు జరిగాయి. ఆయా ఘటనల్లో ఎనిమిది మంది మృతి చెందారు.

రాజానగరం: జాతీయ రహదారి, గామన్ బ్రిడ్జికి వెళ్లే రహదారి నాలుగు లేన్లతో విశాలంగా విస్తరించినప్పటికీ, ఆయా రహదార్లపై ప్రమాదాలు మాత్రం తగ్గడం లేదు. గతంలో సింగిల్ వేగా ఉన్న సమయంలో ఇరుకు రోడ్డుతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగేవి. జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించిన తరువాత ఎదురెదురు ఢీకొనే ఘటనలు తగ్గాయి కానీ, రోడ్డు ప్రమాదాలు మాత్రం పెరిగిపోతున్నాయి. అతివేగం అనర్థదాయకం, రాంగ్ రూటులో ప్రయాణం ప్రమాదకరం.. అంటే రవాణా శాఖ, పోలీసులు చెప్పే మాటలు నినాదాలకే పరిమితమన్నట్టుగా మారాయి. వాహన సామర్థ్యానికి మించిన వేగంతో చోదకులు ప్రయాణించడంతోనే ఎక్కువ శాతం ప్రమాదాలు జరుగుతున్నాయనేది వాస్తవం. గడచిన మూడు మాసాల్లో జాతీయ రహదారి పైన, గామన్ బ్రిడ్జికి వెళ్లే రహదారిపైన జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే ఈ విషయం అవగతమవుతుంది.

రోడ్లు విశాలంగా ఉన్నా..

రోడ్లపై ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొనడంతో ప్రమాదాలకు జరుగుతాయనేది తెలిసిన విషయమే. కానీ జాతీయ రహదారి, గామన్ బ్రిడ్జికి వెళ్లే రహదార్లు నాలుగు లేన్లుగా విస్తరించబడి ఉన్నాయి. ఈ రహదార్లపై ప్రయాణం ఎంతో సురక్షితమని విశాలంగా అభివృద్ధి చేసిన ఆ రోడ్లను చూస్తే తెలుస్తోంది. కానీ ఈ రహదార్లపై కూడా తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి, ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. ఇందుకు ప్రధాన కారణం అతివేగమని అందరికీ తెలుసు. దానిని నిరోధించే పని మాత్రం ఎవ్వరూ చేయరు. ముఖ్యంగా సంబంధిత అధికారులకు అసలు ఆ ఆలోచనరాన్నట్టుగా వ్యవహరిస్తుంటారు. అతి వేగంతో ప్రయాణిస్తూ ముందు వెళ్లే వాహనాన్ని అధిగమించే క్రమంలో వెనుక నుంచి ఢీకొని, ప్రమాదాలకు, తద్వారా ఆయా వ్యక్తుల మరణాలకు చోదకులు కారణమవుతున్నారు. వీటితో పాటు రాంగ్ రూటులో ప్రయాణిస్తూ ప్రమాదాలకు మరికొందరు కారకులవుతున్నారు.

పట్టించుకోని అధికారులు

రోడ్డు ప్రమాదాలకు ఎక్కువగా కారణమవుతున్న వాహనాల అతివేగం, రాంగ్ రూటులో ప్రయాణించడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటి వాటిపై చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. వాహన సామర్థ్యానికి మించి, అవగాహన లోపంతో అతివేగంగా వాహనాలను నడపడం వలన ఆయా వ్యక్తులతో పాటు, అవతలి వాహనాలపై ప్రయాణించే అమాయకులు కూడా బలైపోతున్నా, పోలీసు శాఖ స్పందించి, చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి.

భద్రత... ప్రచారాలకే పరిమితమా?

రోడ్డు ప్రమాదాలను నివారించడంలో, రహదారి భద్రతపై అవగాహన కల్పించడంలో ఏడాదిలో ఒకసారి రహదారి భద్రత వారోత్సవాలు, మాసోత్సవాల పేరుతో సదస్సులు, సమావేశాలు నిర్వహించే అధికారులు, ఆ తరువాత వాటిపై శ్రద్ధ వహించడం లేదనడంలో వాస్తవం లేకపోలేదు. ప్రమాదాల నివారణ, రహదారి భద్రతపై ప్రజలను చైతన్యపర్చడంలో మాత్రం సఫలీకృతులు కాలేకపోతున్నారు. ఫలితంగానే రోడ్డు ప్రమాదాలు తగ్గడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అతివేగాన్ని నియంత్రించాలి



జాతీయ రహదారి, గామన్ బ్రిడ్జికి వెళ్లే రోడ్లు విశాలంగా ఉన్నా కానీ, తరచూ ప్రమాదాలు జరిగి, ప్రాణనష్టం జరుగుతూనే ఉంది. ఇందుకు ప్రధాన కారణం అతివేగంతో వాహనాలను నడపడమే అనేది అందరికీ తెలుసు. దీనిని నియంత్రించడంలో సంబంధిత అధికారులు శ్రద్ధ చూపాలి. అతివేగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్లలో ప్రయాణాలను నియంత్రించాలి.

– సత్తి త్రిమూర్తులు, ఆలమూరు

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి



ర్యాలీ చేస్తున్న పోలీసులు, ఆటో డ్రైవర్లు

పెదపూడి: నాటుసారా, డ్రగ్స్ రహిత రాష్ట్ర నిర్మాణానికి అందరూ కృషి చేయాలని అనపర్తి ఎస్సై శ్రీను నాయక్ అన్నారు. అనపర్తిలో శుక్రవారం సాయంత్రం పోలీసులు, ఆటో డ్రైవర్లు, స్థానికులతో యువత మేలుకో కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు మందులకు అలవాటుపడి, చెడుమార్గం పడుతున్నారన్నారు. దీంతో చిన్న వయస్సులోనే వారి జీవితం పాడవుతుందన్నారు. దీనిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. నాటుసారా, డ్రగ్స్, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు.

ఎల్‌టీ వైరు కాలడం వల్లే..

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి సబ్‌స్టేషన్ పరిధిలో ఎల్‌టీ కేబుల్ కాలిపోవడం వల్లే బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ శ్రీధర్‌వర్మ తెలిపారు. దీనివల్ల బూరుగుపడి, గుమ్ములూరు, బుచ్చెంపేట గ్రామాల్లో గంట మాత్రమే సరఫరా నిలిచిందన్నారు.

ప్రజా పక్షాన పోరాడతాం

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఉండేశ్వరపురం, వెదుళ్లపల్లిలో నా కార్యకర్తలు–నా కుటుంబం



ఉండేశ్వరపురంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: కక్ష సాధింపే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని, వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. శుక్రవారం ఉండేశ్వరపురం, వెదుళ్లపల్లిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నా కార్యకర్తలు–నా కుటుంబం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సంక్షేమ పథకాల అమలు కోసం ప్రజల పక్షాన పోరాడుతామని చెప్పారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా హామీలను అమలు చేయలేక, ప్రజలను నమ్మించి మోసం చేశారన్నారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలు చేయకపోగా, దోపిడీయే లక్ష్యంగా పనిచేస్తోందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేయకపోగా, దోపిడీకి దిగిందని, విద్యుత్ చార్జీల బాదుడుతో ప్రజలను దోచుకుంటోందన్నారు. ఆరోగ్యశ్రీ మూలన పడేశారని, పేద ప్రజలకు వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు నిర్వీర్యమయ్యాయని, రెడ్ బుక్, మాఫియా రాజ్యంతో స్కామ్‌ల పాలన రాష్ట్రంలో సాగుతోందన్నారు. మహిళలు, రైతులు, పిల్లలు, నిరుద్యోగులను నిలువునా ముంచారని, ఈ పాలనలో ప్రజలకు లబ్ధి చేకూరిందేమీ లేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీని బలోపేతం చేయడం ద్వారా ప్రభుత్వ అక్రమాలను ఎదుర్కొంటామని చెప్పారు. హామీలను గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యకర్తలు ఐక్యంగా ఉండి, కూటమి ప్రభుత్వ ఆగడాలను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో-కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కోండ్రపు ముత్యాలు, మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, నాయకులు చల్లమళ్ల సుజీ రాజు, సర్పంచ్ మాకాల ఈశ్వరరావు, ఉప సర్పంచ్ పెనుగుల నాగేశ్వరరావు, కవల కృష్ణమూర్తి, తన్నీరు కృష్ణ, తన్నీరు తాతాజీ, కవల దుర్గం, బొమ్ములు శ్రీనివాస్, అంబటి రాజు, మల్లిన చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం

తహసీల్దార్ సీతాపతిరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీతాపతిరావు

పెదపూడి: మత్తు మందుల వినియోగానికి అలవాటు పడి విలువైన జీవితాన్ని యువత నాశనం చేసుకోవద్దని తహసీల్దార్ పీవీ సీతాపతిరావు హితవు పలికారు. ఎక్సైజ్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో గండ్రేడు గ్రామంలో యువత మేలుకో కార్యక్రమంపై శుక్రవారం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతాపతిరావు మాట్లాడుతూ, సమాజంలో చాలా మంది చిన్న వయస్సులోనే మాదకద్రవ్యాలకు అలవాటుపడి విలువైన జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు చక్కని బాటలో నడిచే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. మత్తు మందుల వినియోగం, వాటి దుష్ఫలితాలను ప్రజలకు వివరించారు. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుడిపూడి మాధవీలత, ఎక్సైజ్ శాఖ డీసీ చైతన్యమురళి, ఏసీ రేణుక, సూపరింటెండెంట్ ఎం.కృష్ణకుమారి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ వి.మౌనిక, వీఆర్వో ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ, దయ లోపించడం వల్లే అరాచకాలు



రంగంపేటలో మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

రంగంపేట: ప్రతి మానవునిలో అంతర్గతంగా దాగి ఉన్న ప్రేమ, దయ వంటి లక్షణాలు లోపించడం వల్ల అరాచకాలు ఎక్కువయ్యాయని, దాని నివారణకు దేవతా ధ్యానం అవసరమని భారతదేశ సిస్టర్ హుడ్ ఆఫ్ ది రోజ్ అధ్యక్షురాలు, స్కూల్ ఆఫ్ అసెన్షన్ వ్యవస్థాపకురాలు దుగ్గిరాల శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక ఉండవిల్లి పద్దరాజు, భ్రమరాంబిక స్వగృహంలో శ్రీమాత గాడెస్ టెంపుల్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సౌర చక్రం గరిష్ఠ స్థాయికి చేరుతున్న తరుణంలో వచ్చే శక్తి మార్పులు అందరూ తట్టుకుని నిలబడి, భావితరాలకు విశ్వశాంతిని అందించాలనే లక్ష్యంతో ఈ టెంపుల్‌ను ప్రారంభించామన్నారు. స్త్రీ, పురుష సమతుల్యతకు కావలసిన శక్తిని పొందాలంటే, దేవతా ధ్యానంలో ఉన్న శక్తిని ప్రతి ఒక్కరూ కాంతి రూపంగా పొందడానికి స్వయం సాధన చేయాలన్నారు. ఈ శక్తిని వ్యక్తిగతంగా, సామాజికంగా, విశ్వవ్యాప్తంగా వ్యాపింపజేయడానికి సాధకులు కార్యోన్ముఖులు కావాలన్నారు. బాల్యం నుంచి చిన్నారులకు, యువతకు దేవతా ధ్యానం ఆవశ్యకతపై అవగాహన కల్పించాలన్నారు. ఆంధ్రాలో ప్రథమంగా రంగంపేటలో ఈ టెంపుల్‌ను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో వైజాగ్‌కు చెందిన మాధవ్, నేహ, హైదరాబాద్ నుంచి ప్రభ, భార్గవి, స్థానిక సాధకులు స్వర్ణ, తులసి, దుర్గ, విజయ పాల్గొన్నారు.

మొక్కలను దత్తత తీసుకోవాలి



పుష్కర వనంలో మొక్కలు నాటుతున్న అధికారులు

రాజానగరం: వివిధ కార్యక్రమాల్లో మొక్కలను నాటడంతో పాటు, వాటిని దత్తత తీసుకుని, సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావొచ్చని రాజమహేంద్రవరం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు బీఎస్ఎస్ మూర్తి అన్నారు. లాలాచెరువులోని గోదావరి మహా పుష్కర వనంలో అడవి–ఆహారాలు అనే అంశంపై అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, వృక్ష శాస్త్ర విభాగం విద్యార్థులు, అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొని, ఆ ప్రాంతంలో కొన్ని మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి, కోనసీమ అటవీ శాఖ అధికారులు రవీంద్ర ధామా, ఎంపీ ప్రసాదరావు, రాష్ట్ర సిల్వీకల్చరిస్టు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 571 మంది హాజరు

రంగంపేట: మండలంలోని రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఇంగ్లిష్ సబ్జెక్టులో నిర్వహించినట్టు మండల విద్యా శాఖాధికారి పి.మధుసూదనరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడు కేంద్రాల్లోను మొత్తం 572 మంది విద్యార్థులకు, 571 మంది హాజరైనట్టు తెలిపారు. రంగంపేటలో 205 మంది, వడిశలేరులో 183, సింగంపల్లిలో 183 మంది పరీక్షలు రాసినట్టు చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసినట్టు తెలిపారు.

ఆరుగురు గైర్హాజరు

బిక్కవోలు: మండలంలోని పదో తరగతి పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలోని బిక్కవోలు, బలభద్రపురం, పందలపాక పరీక్షా కేంద్రాల్లో 576 మందికి 570 మంది విద్యార్థులు హాజరైనట్టు ఎంఈవో-1 సీహెచ్ సత్యనారాయణ తెలిపారు.

చిన్నారులకు పోషకాహారం, మెరుగైన విద్య

ఐసీడీఎస్ కాకినాడ సీడీపీఓ జ్యోతి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీడీపీఓ

పెదపూడి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారం, మెరుగైన విద్య అందించడానికి అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఏ.జ్యోతి తెలిపారు. రామేశ్వరం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ, పఢాయి భీపై రెండో రోజు శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన పోషకాహారంపై, అలాగే ప్రీ స్కూల్ చిన్నారులకు నాణ్యమైన విద్య అందించడానికి, అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ఈ శిక్షణ తరగతులు దోహదపడతాయని వివరించారు. కార్యక్రమంలో సంపర, పెదపూడి సెక్టార్ల సూపర్‌వైజర్లు శ్రీగౌరీ, శ్రీపద్మ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణానికి హాని కలిగించొద్దు

'నన్నయ' వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ



సదస్సులో మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: అభివృద్ధి పేరుతో పర్యావరణానికి హాని కలిగించరాదని, పర్యావరణ హితంగా జీవించాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, సుస్థిరాభివృద్ధిపై ఎకో‌ప్రెన్యూర్‌షిప్ ప్రభావం అనే అంశంపై శుక్రవారం సదస్సు జరిగింది. పర్యావరణ సమస్యలను పరిష్కరించడమే కాకుండా స్థిరమైన పద్ధతులకు దారితీసే గ్రీన్ బిజినెస్‌ని సృష్టించడంపై దృష్టి సారించే ఎకోప్రెన్యూర్‌లు, వ్యవస్థాపకుల ఆవిర్భావానికి 1960–70 కాలంలో జరిగిన ఆధునిక పర్యావరణ ఉద్యమాలు దారితీశాయన్నారు. అడవిలో అక్షర సేద్యం చేసి, వాటి అభివృద్ధిని చూసి వచ్చానన్నారు. రిటైర్డ్ ఆచార్యులు పి.సుబ్బారావు మాట్లాడుతూ, ఎకోప్రెన్యూర్‌షిప్, ఎంట్రప్రెన్యూర్‌షిప్ మధ్య ఉన్న వ్యత్యాసాలను వివరించారు. వర్ధమాన పారిశ్రామికవేత్తలు సౌజన్య, బిందు, లావణ్య, నిరీష్ మాట్లాడుతూ, పర్యావరణ హితంగా వ్యాపారాలు, పరిశ్రమలు ఉండాలని చెప్పారు. అప్పుడే భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించగలుగుతామన్నారు. కార్యక్రమంలో పి.ఉమామహేశ్వరీదేవి, ఎస్.ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

యతి, ప్రాసలకు దిగులు వద్దు

కవితలలో యతి, ప్రాసలు ఉండాలని దిగులు చెందకుండా, మనస్సులో ఉప్పొంగే భావాలకు అక్షర రూపం ఇవ్వడం నేర్చుకుంటే తద్వారా కవిత్వం అలవాటు అవుతుందని వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ విద్యార్థులకు సూచించారు. ఇంగ్లిష్, తెలుగు శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ కవితా దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషల్లో తనదైన శైలిలో కవితలు వినిపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, ఆచార్య కేఎస్ రమేష్, డాక్టర్ తలారి వాసు, హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్.సుజనారాజ్, డాక్టర్ డి.లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

రాజానగరం: ఇంటి నుంచి వెళ్లిన తన భర్త రెండు వారాలుగా తిరిగి రాలేదని మండలంలోని శ్రీరామపురానికి చెందిన కరెడ్ల కుసుమ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాజానగరం ఎస్సై నాగార్జున తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాపీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న 36 ఏళ్ల కరెడ్ల రాంబాబు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 8న ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి, ఇప్పటివరకూ తిరిగి రాలేదు. అప్పటి నుంచి బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించినా, అతడి ఆచూకీ దొరకలేదు. ఈ మేరకు అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గంజాయి నిర్మూలనపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, స్థానికులు

రాజానగరం: కొంతమూరులో గంజాయి నిర్మూలనపై శుక్రవారం రాజమహేంద్రవరం నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ పర్యవేక్షణలో రాజానగరం సీఐ వీరయ్యగౌడ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అవుట్ పోలీసు స్టేషను నుంచి శానిటోరియం వరకు జరిగిన ఈ ర్యాలీలో.. మత్తుకు యువత దాసోహం కావొద్దు, జీవితాలను బలి చేసుకోవద్దంటూ నినాదాలు చేశారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, వాటి నిర్మూలనను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పీ4 సర్వే ప్రచురణ

పెదపూడి: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ4 సర్వే మండలంలో నూరు శాతం పూర్తయిందని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్ర రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం పెదపూడిలో మాట్లాడుతూ, నూరు శాతం పూర్తయిన సర్వే వివరాల జాబితాను శనివారం గ్రామ సచివాలయాల్లో ప్రచురిస్తారన్నారు.

వాటిపై ఏమైనా అభ్యంతరాలుంటే, ఈ నెల 24న పంచాయతీల వద్ద నిర్వహించే గ్రామసభలో సవరించుకోవాలన్నారు. ఈ సర్వేలో సేకరించిన డేటా ఆధారంగా ఇంటి అవసరాలకు అనుగుణంగా సమర్థవంతమైన ప్రణాళికల రూపకల్పనకు వీలవుతుందన్నారు. పేదరికాన్ని దూరం చేసేందుకు, సామాజికంగా, ఆర్థికంగా పేద కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా ప్రోత్సహించడమే పీ4 సర్వే ఉద్దేశమన్నారు. ఆయన వెంట అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసు, పలువురు సిబ్బంది ఉన్నారు.

కులవృత్తి సంఘాలకు అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

బిక్కవోలు: మండలంలోని పలు బీసీ కుల వృత్తిదార్ల సంఘాల నాయకులతో ఆదరణ–3 పథకం కోసం అవగాహన సదస్సు జరిగింది. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆదరణ–3 పథకంలో కుల వృత్తుల వారికి పరికరాలను అందించడానికి ప్రభుత్వం సమాయత్తమైందన్నారు. అందుకోసం ప్రతిఒక్కరూ కులవృత్తిలో ఏ పరికరం, ఏ కంపెనీ కావాలన్నా సంబంధిత సచివాలయం ద్వారా తెలియజేయాలన్నారు. ఈ నివేదికను ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ప్రభుత్వం ఆ పరికరాలను నేరుగా సచివాలయం ద్వారా లబ్ధిదారులకు అందించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఏవో రత్నకుమార్, సీనియర్ అసిస్టెంట్ మంగరాజు తదితరులు పాల్గొన్నారు.